కథానిక

# ప్రణయంలో శవపరంపర

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

అనూరాధ ఎలానూ అడుగుతుందికదా అని సత్యం బుక్‌స్టాలు దగ్గిర నిలబడి పత్రిక కోసము అని చూస్తున్నాడు.

ఆ అమ్మాయికి పుస్తకాలు ఉంటేచాలు; అందుకని అతనికి ఈ మధ్య బుక్‌స్టాల్ అనుదిన అవసరము ఐపోయింది. అతన్ని చూడగానే చిన్న చిరునవ్వు పారేసి, "కొత్త పుస్తకాలు వచ్చేయిసార్! చూస్తారా?" అన్నాడు స్టాల్ ప్రొప్రయిటర్.

"ఏమి వొచ్చాయి?" అన్నాడు సత్యం—తనకాపుస్తకాలని గురించి ఏమీ తెలీదు గనక అతనే ఏదో చూపెడతాడని.

"గొప్ప పుస్తకాలు వచ్చాయి సార్!—ఇంకో గంట తరవాత ఒక్క కాపీ ఉండదిక్కడ.... ఇంకా కాలేజీ వాళ్లకి తెలియక, ప్రొద్దుటనగా పార్సెల్ వచ్చినా ఐపోలేదు!" అన్నాడు ప్రొప్రయిటర్.

సత్యానికి నోటమాట రాలేదు. అతనూ ఉండీఉండీ ఏమన్నా రాస్తూ ఉంటాడు. తెనుగు పుస్తకాలు చదువుతూ ఉంటాడు. కాని ఇంత ఉప్పెన వచ్చిందని అతనికి తెలీదు—ఆంధ్రదేశంలో నవల ఐదువందల కాపీలు కన్న అమ్మదనే అమాయికత్వం అతన్నింకా వొదలలేదు. ఇదంతా వింటోంటే నోటమాట రానేలేదు సత్యానికి.

"అంత సేలే!" అన్నాడు గ్రుడ్లు మిటకరిస్తూ చివరికి అతను.

"చాలవుసార్! మా కాలేజీకి నూటడెభై కాపీలండి-ఏ శవము వొచ్చినా సరేనండి-కట్టవిప్పగానే వేరే పెట్టేయాలండి. మరి కాలేజీ ఆడపిల్లలకి శవాలూ, హత్యలూ ఏ వొచ్చినా అరవైఎనిమది కాపీలు జమేనండి...."

"శవాలా?" గొణిగేడు సత్యం-బిత్తరపోయి "శవాలా?"

"అవును సార్! పారిపోయిన శవం, లేచిపోయిన శవం, నవ్విన శవం, గదిలో శవం, మంచంకింద శవం, తలలేని శవం, కుళ్ళిపోయిన శవం, ఆఫీసులో శవం, టెలిఫోన్ బూత్‌లో శవం, ఒకటేమిటి సార్! ఎల్లుండి పద్దెనిమిదో తారీఖున కూనీ పబ్లికేషన్స్‌వారి, కాలనిశవం, కుళ్ళని శవం రెండూ ఒకేరోజున గ్రాండ్ రిలీజ్!—సార్! మీకు కావలిస్తే ఇప్పుడే అడ్వాన్సు ఇచ్చేయండి. ఎనిమిదొందలు మాత్రమే వొస్తున్నాయి. ఇంతకుముందు ఏ శవము వెయ్యికి తక్కువవొస్తే దొమ్మీసార్! దొమ్మీ!"

సత్యము మూర్ఛపోబోయి ఆగిపోయాడు. స్టాల్‌నిండా శవాల పుస్తకాలు. అతనది ఇప్పటిదాకా చూడలేదు. మొన్న ఏదో సందర్భంలో అనూరాధ 'చీరలకోసం హత్య' అనే పుస్తకం చదువుతూంటే ఏదోలే అనుకున్నాడు తాను నిన్న 'పట్టపగలు హత్య' ఆమె చేతిలో చూశాడు....ఇంక ఈ శవాలు....

"ఏదేనా పత్రిక...."

"కూనీలూ – శవాలూ, కావాలాండి?—అన్నీ డిటెక్టివ్ కథలే సార్!—"

"కాదయ్యా!—ఏదైనా సారస్వత పత్రిక నాలాటివాడు చదువుకుందుకు—"

ప్రొప్రయిటరు "మీరేదో గొప్పవారనుకున్నాను-ఇంతేనా!" అన్నట్లు చూసి విసురుగా ఓ వారపత్రిక ఇటు పారేసి డబ్బులు పెట్లోకి విసిరేసి, అతి హేళనగా చిరునవ్వి, చదువుకుంటూన్న 'అద్దంలో శవం'లోకి జారుకున్నాడు. తానా పత్రికకొంటూ అతని భావనలో ఎంత హీనస్థితికి జారిపోయాడో బాగా

తెలిసింది సత్యానికి—ఆ చూపుతో, చిరు నవ్వుతో సత్యానికి బుర్ర దిమ్మెక్కి వాంతి వెళ్ళినంత పనయింది. శృంగారం అంటే అర్థం ఉంది; హాస్యం అంటే అర్థంఉంది; కథలు అంటే అర్థం ఉంది. అంతే గాని, ఈ శవాల మీద మోజేమిటో! వాళ్ళకి ఈ హత్యలూ, శవాలూకన్న ప్రియమైనదే ఉన్నట్లు లేదు!

ఇలాంటి వెర్రి ఆలోచనల్లో పడి ఇంటిలో అడుగుపెట్టేసరికి అనూరాధ తలుపుతీసి అతని వొంక చూడకుండానే గదిలోకి వెళ్లిపోయింది. మామూలుగా ఈరోజున తనని పత్రిక అడిగి మరీ తెప్పించుకుని చేతిలోంచి లాక్కోవడము ఆమెకి అలవాటు-అలాటిది ఈ ఉదయము తనని ఆమె అడగనూలేదు-ఇప్పుడు తనవొంకే చూడలేదు. ఎంతో బాధపడిపోయాడు సత్యం.

తన కాఫీ టేబిల్ మీద పెట్టేసి ముఖము తిప్పుకుంది అనూ. ఆమె ముఖములోని బాధా, కన్నీళ్ల మేఘాలు కమ్ముకున్న కళ్లూ—ఏమీ బోధపడలేదతనికి.

"ఏమి అనూ?" అన్నాడు సత్యం సానునయముగా ఆమెని తనవైపు తిప్పుకుంటూ.

"ఎందుకూ అడగడము?" అని ఆమె మళ్ళా రెండోవేపు తిరిగింది.

"నువ్వు చెప్పకపోయినా నీ పత్రిక తెచ్చేనుగా!" అన్నాడు సత్యం. వెర్రివాడు!

"అయ్యో!" అని నిట్టూర్చింది జవరాలు అనూరాధ. మరుక్షణము ఆమె కళ్లు ఎర్ర బడ్డాయ్. "అందుకే ఇవాళ సరోజా, జానకీ నన్ను అలా ఇన్సల్ట్ చేశారు - మీరు విజ్ఞానవంతులనీ, నేనెంతో అదృష్టవంతురాలిననీ అనుకున్నాను. అంతాపేరాస అయిపోయింది!"

అనూరాధ కళ్లవెంట నీళ్లు వచ్చేస్తున్నాయ్. సత్యం కంగారుగా, బ్రతిమాలుతూ, "చెప్పు! అనూ! ఏమన్నారు?" అన్నాడు. వాళ్లకి అనూ అంటే చాలా అభిమానం అని అతని ఉద్దేశం.

"ఏమనాలి! .... వాళ్లు అస్తమానం పుస్తకాలని గురించి మాటలాడుకుంటారు. మధ్యాహ్నము సరోజ వచ్చి, 'పుస్తకములో శవం' నీదగ్గర ఉందా? అని అడిగింది. నేను తెల్లబోయి అదేమిటని అడిగాను. ఇంతట్లో జానకి వచ్చింది. వాళ్ళొకటే నవ్వు — ఈ మాత్రము తెలీదా అని. వాళ్ళ మగాళ్లు ఏ కొత్త పుస్తకము వచ్చినా అడ్వాన్సు లిచ్చి మరీ తెప్పిస్తారు. వాళ్ళ కన్నీ తెలుసు-నాకు-"

అనూ కంఠము గాద్గదికము ఐపోయింది. ముఖము తిరిగి కుర్చీలో కూలబడ్డాడు సత్యం- "పుస్తకములో శవము" అని గొణుక్కుంటూ.

"అవును .... మనము ఒట్టి పాతకాలపు వాళ్లమని వాళ్ళందరూ అనేసుకుంటున్నారు."

ఇంక సహించలేక అనూ వెక్కివెక్కి ఏడవడము మొదలు పెట్టింది. మొదట బిత్తరబోయి, తేరుకుని, ఆలోచనలు కట్టబెట్టి ఆమెని బుజ్జగించి "అదేమిటి అనూ! నీకు ఏమి కావాలంటే అదే తెస్తానుగా—" అరగంట బ్రతిమాలి ఊరుకోబెట్టాడు సత్యము.

"నిజముగా?" అంది అనురాధ.

"ఆఁ" అన్నాడు సత్యము.

కళ్లు తుడుచుకుని సముదాయించుకుంది అనూరాధ. ఆమె కళ్లల్లోకి తిరిగి పూర్వపు ఆనందం వొచ్చేసింది.

"ఎంత మంచివారండీ!"

సత్యానికి నవ్వాలో ఏడవాలో తెలియలేదు.

"అయ్యో!-కాఫీ చల్లారిపోయింది. మళ్ళా పెడతాను. మీరీలోపున షాపుకి వెళ్ళి శవాల సీరీస్ పట్రండి—"

"శవాల సీరీస్?" పెద్ద ఫుట్ బాల్ గొంతుకలో పడినట్లయింది సత్యానికి.

"ఆఁ....నవ్విన శవము, ప్రేమించిన శవము. పారిపోయిన శవము. కుళ్ళిపోయిన శవము, ఆఫీసులో శవము, పుస్తకములో శవము-ఆ పైన మీ ఇష్టం...."

సత్యము తొందరగా గుమ్మంవైపు నడిచాడు. అతని కాళ్లు తేలిపోతున్నాయ్.

"జ్ఞాపకం ఉండదేమో!—రాసుకొండీ" అని కేకవేసింది అనూరాధ ఉత్సాహంగా.

"అక్కర్లేదులే—" అని తొందరగా బయటికి నడిచాడు సత్యం. షాపులో నోటికొచ్చిన శవమల్లా అడిగేదల్చుకున్నాడు తాను. అనూని సముదాయించడాని కేమైనా సరే చేస్తాడు.

శవాలలో మునిగి తేల్తూ పావుకి రానే వచ్చాడు సత్యం.

"ఏంసార్ ? మళ్ళీ వొచ్చారు ?" అన్నాడు ప్రొప్రయిటర్—అనుమానంగా అతని వొంక చూస్తూ.

నిటారుగా నిలబడి. దర్జాగా "చూడూ ! నీ దగ్గరవున్న శవాలన్నీ రకానికొకటి తీసిఇయ్యి"-అన్నాడు సత్యం.

పదినిమిషాలలో పాతిక పుస్తకాలు కట్ట కట్టాడు ప్రొప్రయిటర్. "సార్—ఇరవై ఒక్క రూపాయలు—"

పర్సుతీసి ఇచ్చి చిన్న కూలివాడిని పిల్చి శవాలపాకెట్ వాడినెత్తిని పెట్టాడు సత్యం. అతనికి ఒళ్లు మండిపోతుంది—కాని, ఏం చేస్తాడు? అనూ-ఒక్కటే ఓదార్పు తనకి. ఆమె కళ్ళనీరు తాను సహించలేడు. ఆమె నగలూ, చీరెలూ, ఖరీదైన కోరికలు కోరలేదని తనని—పాతిక రూపాయిల పుస్తకాలు....

"సార్! ఈ వారంలో కాలనిశవం, కుళ్లని శవం వస్తాయి...."

"ఇదిగో అడ్వాన్సు—ఇకనించి ఏ శవము వొచ్చినా నాకొకటి రిజర్వుచేసేయ్! మరచి పోకు !"

"అలాగే సార్!" అని నమస్కరించాడు ప్రొప్రయిటరు. మరుక్షణం కమలాకరరావు అక్కడికి రావడం తటస్థించింది:

" ఏం బ్రదర్ !—ఇవన్నీ కొని తీసుకెడు తున్నావ్ ?—మామూలుకథలు మాని డిటెక్టివ్ నవల్సు రాస్తావా?" అన్నాడు.

అసలే ప్రచండమైన మంటలో ఉన్నాడేమో. చికాకుగా, "ఆఁ...." అన్నాడుసత్యం.

"వెరీగుడ్ !" అని కమలాకర్రావు సెలవు తీసుకున్నాడు. సత్యం ఇంటివైపు అడుగువేసీ వెయ్యడంతోనే "సార్ !" అని పెద్దకే వినిపించింది. ప్రొప్రయిటరు....

"సార్! మీరు డిటెక్టివ్ నవల రాస్తారుట కాదండీ! మీ నవల నాకు ఇవ్వండి సార్! పబ్లిష్ చేసుకుంటాను. కేష్ నూటఏభై డౌన్ సార్-సార్! ప్లీజ్"

సత్యం తెల్లబోయి నిలబడ్డాడు. "నేను—ఇంకా—"

"రెండువందలు సార్!"

"తరువాత ఆలోచిద్దాము!" అని సత్యం ఇంటివైపు తొందరగా దారితీసేడు - ఆశ్చర్య పడుతూ సత్యం.

"పోనీ, పేరు చెప్పండి సార్-రెండువందల ఏభైసార్!" వెనకాలపడ్డాడు.

"శవాల సముద్రము!"అని అరిచి సత్యం మరి కొంచెము వేగము హెచ్చించేడు. ప్రొప్రైటరు—"మూడువందలు సార్!" అని అరిచి వెనక్కి తగ్గాడు. బేరం సెటిల్ ఐపోయింది.

గుమ్మములో నిలబడి ఎదురుచూస్తోన్న అనూ పుస్తకాలన్నీ చేతుల్లోకి తీసుకుని లోపలికి పరిగెట్టింది. కూలీవాణ్ని పంపించి సత్యం లోపలికి వెళ్లేసరికి ఆమె అన్ని పుస్తకాలనీ చందమామలాటి ముఖంలోని కలువరేకుల కళ్లతో చూస్తోంది. సత్యం గదిలోకి రాగానే అతన్ని గట్టిగా కావిలించుకుని ముఖమునిండా ముద్దులు పెట్టుకుంది— "ఎంత మంచి వారండీ!" అంటోను. ఆమె కళ్లమ్మట వొస్తూన్న ఆనందాశ్రువులు ఏదో చెప్తూ సత్యాన్ని మరీ బాధపెట్టసాగాయి....

"వొచ్చే శవాలసీరీస్, హత్యలసీరీస్—అన్నిటికీ అడ్వాన్సిచ్చాము" అన్నాడు సత్యం.

"ఎంత మంచివారండీ!" అంటూ మళ్ళీ మొదటినించీ ముద్దులు పెట్టుకుంది అనూ!

ఆమె కొంచెం శాంతించి పుస్తకాల దగ్గరికి వెళ్ళాక కుర్చీలో కూలబడి—"అమ్మాయీ! ఇది హత్యల యుగమూ శవాల శకమూను!" అనుకున్నాడు సత్యం. తాను 'శవాలసముద్రం' రాయబోతూన్నట్లు ఇంకా ఆమెకి చెప్ప లేద తను—ఈ సమయంలో చేప్తే ఆనందాతిరేకంలో ఆమెకి గుండెపగిలిపోతుందని అతనికి తెల్సును. కాస్త అలా ఆలోచించి తలనిండా ముసురుతూన్న శవాలని తోసేసి, నెమ్మదిగా ఆమె కాళ్లక్రింద నలిగిన పత్రికని జాలిపడి తీసుకుని చదవడం మొదలుపెట్టాడు సత్యం—కానున్న డిటిక్టివ్ కథకుడు—"శవాల సముద్రం" గ్రంథకర్త.

★